క్లుప్తంగా

సత్యదేవుని దర్శించిన కేరళ హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్



రత్నగిరిపై జస్టిస్ మంజులకు స్వాగతం పలికిన అధికారులు, పండితులు

తొండంగి: కేరళ హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ చెల్లూరు మంజుల ఆదివారం కుటుంబ సమేతంగా అన్నవరంలో రత్నగిరిపై సత్యదేవుని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి వ్రతమాచరించారు. ఆలయం వద్ద ఆమెకు పండితులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేదపండితులు ఆశీస్సులు అందజేయగా సత్యదేవుని చిత్రపటం ప్రసాదాన్ని దేవస్థాన అధికారులు అందజేశారు.

సత్యదేవుని దర్శించిన శ్రీశైలం దేవస్థానం ఈఓ



సత్యదేవుని సన్నిధిలో శ్రీశైలం దేవస్థానం ఈవో పెద్దిరాజు

శ్రీశైలం మల్లికార్జునస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి గాదిరాజు పెద్ది రాజు ఆదివారం అన్నవరంలో రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు అధికారులు ఘన స్వాగతం పలికారు. పూజల అనంతరం పండితులు సత్యదేవుని చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

వేద పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ



శ్రీవర్ధన్‌కు ప్రశంసా పత్రం అందజేస్తున్న పండితుడు మారుతి వెంకటరామ శర్మ

గండేపల్లి: మండలంలోని తాళ్లూరుకు చెందిన వెలవలపల్లి శ్రీవర్ధన్ అన్నవరం సత్యదేవ స్మార్తా ఆగమ పాఠశాలలో చివరి సంవత్సరం చదువుతున్నాడు. జనార్ధన నందసరస్వతీ స్వామి సంస్కృత ట్రస్ట్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలోని కీసరగుట్ట వేంకటేశ్వర వేద విజ్ఞానపీఠంలో మూడు రోజుల పాటు జరిగిన మౌఖిక, రాత, క్రియా విభాగాల పరీక్షల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ ఆరాధ్యుల లక్ష్మీనరసింహ అవధాని తెలిపారు. ప్రతిభ చూపిన శ్రీవర్ధన్‌కు ప్రముఖ స్మార్తా ఆగమ పండితులు మారుతి వెంకటరామ శర్మ ప్రశంసా పత్రం అందజేసినట్టు చెప్పారు.

హరిదాసుకు సత్కారం



లింగంపర్తిలో హరిదాసును సన్మానిస్తున్న సుబ్బారావు, భక్తులు

ఏలేశ్వరం: మండలంలోని లింగంపర్తిలో ఆదివారం హరిదాసును ఘనంగా సన్మానించారు. హిందూధర్మ ప్రచార పరిషత్ జిల్లా సభ్యుడు అలమూరి సుబ్బారావు ఆధ్వర్యంలో హరిదాసు నీలాల ప్రసాద్‌ను పూలమాల, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా హరిదాసుగా ప్రసాద్ విశేష సేవలు అందిస్తున్నారన్నారు. హిందూ సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు ప్రసాద్ చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆకుల సూర్యప్రకాశ్, ఆకుల శివశంకర్, అడపా శివ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల దీక్షలు

ప్రత్తిపాడు: తమ సమస్యల పరిష్కారం కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్లు చేస్తున్న రిలే దీక్షలు ఆదివారం కొనసాగాయి. మండల అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అల్లాడి లక్ష్మి, హేమలత ఆధ్వర్యంలో ప్రభుత్వం తెచ్చిన ఎస్మా చట్టం ప్రతులను దహనం చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

10న 'రా... కదిలి రా' బహిరంగ సభ

ప్రత్తిపాడు: తునిలో ఈ నెల 10వ తేదీ సాయంత్రం 3 గంటలకు జరిగే 'తెలుగు దేశం పిలుస్తుంది రా... కదిలి రా' బహిరంగ సభకు మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు ముఖ్య అతిథిగా హాజరవుతారని టీడీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ తెలిపారు. ఈ సభను విజయవంతం చేయాలని ఆమె కోరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం నియోజకవర్గ స్థాయి టీడీపీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తునిలో జరిగే బహిరంగ సభకు గ్రామస్థాయి నుంచి యువకులు, మహిళలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, నియోజకవర్గ జనసేన కన్వీనర్ వరుపుల తమ్మయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతా



ఆత్మీయ సమావేశంలో తాను చేసిన అభివృద్ధి కార్యక్రమాల పుస్తకాన్ని చూపిస్తున్న తోట నరసింహం



తోట నరసింహాన్ని గజమాలతో సన్మానిస్తున్న పార్టీ నేతలు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం
- గండేపల్లిలో ఆత్మీయ సమావేశం

గండేపల్లి: జగ్గంపేట నియోజకవర్గాన్ని రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ తోట నరసింహం పేర్కొన్నారు. గండేపల్లిలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో తోట నరసింహం, ఆయన తనయుడు తోట రాంజీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసేవ చేయాలనే కోరిక తప్ప తనకు పదవులపై వ్యామోహం లేదన్నారు. దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబానికి, తమ కుటుంబానికి గల సన్నిహిత సంబంధమే తాను జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా రావడానికి కారణమన్నారు. తనకు జగ్గంపేట నియోజకవర్గంపై పూర్తి అవగాహన ఉందన్నారు. తాను మంత్రిగా ఉన్నప్పుడే బొర్రంపాలెం, తాళ్లూరు, యర్రంపాలెం గ్రామాల్లో లిఫ్ట్ ఇరిగేషన్‌ను ప్రారంభించి తాగునీరు, సాగునీరు వసతులు కల్పించామన్నారు. తాళ్లూరు లిఫ్ట్ పైప్ లైన్లను పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయించేందుకు కృషి చేస్తానన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. తొలుత దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం, ఉభయ గోదావరి జిల్లాల ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ గుల్లా ఏడుకొండలు, పార్టీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఒబిణ్ణి వీరబాబు, పార్టీ నాయకులు అత్తులూరి సాయిబాబు, జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ గపూర్, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ మూర్తి, పార్టీ నేతలు తులా రాము, తొండాపు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి



లింగంపర్తిలో ప్రజలను ఓట్లు అభ్యర్థిస్తున్న కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు
- లింగంపర్తిలో పర్యటన

ఏలేశ్వరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు అన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా నియమితులైన తరువాత తొలిసారిగా మండలంలోని లింగంపర్తిలో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో గతంలో ఎన్నడూ లేనివిధంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. పార్టీలకు అతీతంగా పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌ను గెలిపించి రాష్ట్రాభివృద్ధికి తోడ్పాటును అందించాలన్నారు. తొలుత వేద పండితుల ఆశీర్వచనాలు పొంది పర్యటనను ప్రారంభించారు. అనంతరం నియోజకవర్గంలోని పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులను కలుసుకుని వారి మద్దతు కోరారు. ఆయన వెంట పార్టీ నాయకులు వరుపుల సూరిబాబు, వరుపుల రాజబాబు, తదితరులు ఉన్నారు.

మృతుని కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం

జగ్గంపేట: పాల డెయిరీకి ఆటోలో పాలు తీసుకు వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆటో డ్రైవర్ కుటుంబానికి వైఎస్సార్ సీపీ నాయకులు అండగా నిలిచారు. వివరాల్లోకి వెళితే.. జగ్గంపేటలోని జ్యోతుల నెహ్రూ కాలనీకి చెందిన గూనపల్లి లక్ష్మణరావు ఇటీవల తన ఆటోలో యర్రవరం వద్ద ఉన్న డెయిరీకి క్యాన్లలో పాలు తీసుకువెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పాల డెయిరీ యాజమాన్యం పట్టించుకోకపోవడంతో వైఎస్సార్ సీపీ నేత రఘురాం యర్రవరం డెయిరీ నిర్వాహకులతో మాట్లాడి వారి నుంచి లక్ష్మణరావు కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సహాయం సమకూర్చారు. ఆ సొమ్మును లక్ష్మణరావు కుటుంబ సభ్యులకు ఒమ్మి రఘురాం, వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బీమా సొమ్ము త్వరలో వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గొల్లపల్లి శ్రీను, ఆటో యూనియన్ అధ్యక్షుడు కిలపర్తి వీరబాబు, వైఎస్సార్ సీపీ నేతలు నీలపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయం



శంఖవరంలో పర్వత కుటుంబాన్ని కలిసిన వరుపుల సుబ్బారావు

శంఖవరం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడం తథ్యమని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజక వర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు అన్నారు. శంఖవరంలో మాజీ ఎమ్మెల్యే పర్వత బాపనమ్మ, ఎంపీపీ పర్వత రాజుబాబు, జానకీదేవిలను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తాను ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నట్టు తెలిపారు. తన విజయానికి ప్రతి ఒక్కరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వరుపుల సూరిబాబు, గొల్లు చిన్నదివాణం, బెహరా దొరబాబు, వెలుగుల రవి, ఆచంట వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



శంఖవరం హైస్కూల్‌లో కలిసిన పూర్వవిద్యార్థులు

శంఖవరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1982–83 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 40 ఏళ్ల తరువాత తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువా, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో సందడిగా గడిపారు. కార్యక్రమంలో ఈగల సత్తిబాబు, నడిగట్ల నానాజీ తదితరులు పాల్గొన్నారు.

92 మంది బైండోవర్

రౌతులపూడి: సంక్రాంతిని పురస్కరించుకుని ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ఉండేందుకు ముందస్తు చర్యగా పాత నేరస్తులపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై అబ్దుల్ నబీ ఆదివారం తెలిపారు. మండలంలో వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న 92 మందిని బైండోవర్ చేసి తహసీల్దార్ బి.భీమారావు ఎదుట హాజరు పరిచామన్నారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఆనందంగా సంక్రాంతిని జరుపుకోవాలని కోరారు.

నేడు తాళ్లూరులో మంత్రి రాజా పర్యటన

తుని రూరల్: మండలంలోని తాళ్లూరు గ్రామంలో సోమవారం రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా పర్యటిస్తారు. ఉదయం 11 గంటలకు గ్రామంలోని అవ్వాతాతలకు ప్రభుత్వం పెంచిన రూ.3 వేల పింఛన్ల పంపిణీ చేస్తారు. అనంతరం భూ పట్టాల పంపిణీ, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాల్లో పాల్గొంటారు.

పెరుమాళ్లపురంలో...

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురంలో సోమవారం రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా పర్యటిస్తారని ఎంపీడీఓ పసుపులేటి సతీష్ ఆదివారం తెలిపారు. గ్రామంలోని దుర్గా మాత ఆలయం వద్ద ఉదయం 10 గంటలకు అవ్వాతాతలకు మంత్రి రాజా కొత్త పింఛన్లు పంపిణీ చేస్తారని చెప్పారు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

గడ్డి ట్రాక్టర్ దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కిర్లంపూడి: విద్యుత్ తీగలు తగిలి గడ్డి ట్రాక్టర్ దగ్ధమైనట్లు జగ్గంపేట ఫైర్ ఆఫీసర్ లక్ష్మణరావు ఆదివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... సామర్లకోట మండలం పెద్దబ్రహ్మదేవం గ్రామానికి చెందిన రామరాజు ట్రాక్టర్‌పై గడ్డి తరలిస్తుండగా కిర్లంపూడి మండలం సోమవరం వంతెన వద్ద విద్యుత్ తీగలు తలిగి మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న జగ్గంపేట అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.50 వేల ఆస్తి నష్టం జరిగినట్లు లక్ష్మణరావు తెలిపారు.

జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు



ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

కిర్లంపూడి: మండలంలోని సోమవరం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక కాకినాడ జిల్లా సాంస్కృతిక కమిటీ కన్వీనర్ యస్ కన్నబాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు మౌఖిక పరీక్ష, రాపిడ్ ఫైర్, ఆడియో విజువల్ రౌండ్ అంశాలపై పోటీలు నిర్వహించారు. మొదటి ఐదు స్థానాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కేఎంఎంఆర్ ప్రసాద్ బహుమతులు అందజేశారు. ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు, ఎంఈఓ చిన్నారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కిర్లంపూడి: జగపతినగరంలో వేంచేసిన గౌరీశంకరుల ఆలయం వద్ద ఆదివారం విద్యార్థులకు వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. తెలుగు పండిట్ సూరిశెట్టి వీరబాబు, విశ్రాంత ఉపాధ్యాయుడు కంపరపు సత్యన్నారాయణ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పోటీల్లో వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన శరకణం మల్లేశ్వరి, శరకణం ఏసుబాబు, సిమ్మ దుర్గ శిరీష, తర్ర అక్షయ, వి.విజయలక్ష్మికు బహుమతులు అందజేశారు.

గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలు

రౌతులపూడి: మండలంలోని దిగువశివాడ, ఎం.కొత్తూరు గ్రామాల్లో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రలు నిర్వహించారు. ఎంపీడీఓ ఎం.గోవిందు ఆధ్వర్యంలో ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి ఎం.వీరరాఘవరావు, హౌసింగ్ ఎంఈఓ గాడి కొండబాబు పాల్గొన్నారు.

మురిపించన్



కాకినాడలో చిన్నరాజుకు పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ సురేష్



ఏలేశ్వరంలో పింఛన్ అందజేస్తున్న ఏఎంసీ డైరెక్టర్ విజయ్‌కుమార్

ఏలేశ్వరం: నియోజకవర్గ వ్యాప్తంగా ఆదివారం వైఎస్సార్ పింఛన్ల పంపిణీ జోరుగా సాగింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు వలంటీర్లు, వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశారు. పట్టణంలోని 7వ వార్డులో ఏఎంసీ డైరెక్టర్ పైల విజయ్ కుమార్ వలంటీర్లతో కలిసి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులు పింఛన్ల కోసం రోజుల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగేవారన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి పాలనలో వలంటీర్లు లబ్ధిదారుల ఇంటికే పింఛన్లు అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కాకినాడ ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేత

ఏలేశ్వరం: పట్టణ పరిధిలోని 9వ వార్డుకు చెందిన కాటా చిన్నరాజు గుండెపోటుకు గురై కాకినాడలోని మెడికేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతను పింఛను లబ్ధిదారుడు కావడంతో వార్డు వలంటీర్ దనేడి సురేష్ సొంత ఖర్చులతో కాకినాడ ఆసుపత్రి వెళ్లి పింఛను అందజేశారు. వలంటీర్ సురేష్‌ను పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

గ్రామాల్లో పింఛన్ల పంపిణీ

మండలంలోని తొండంగి, గోపాలపట్నం గ్రామాల్లో ఆదివారం సామాజిక పింఛన్ల పంపిణీ జోరుగా సాగింది. ఆయా గ్రామాల్లో లబ్ధిదారులకు జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్‌రాష్ట్ర కార్యదర్శి కొయ్యా మురళి, పార్టీ నాయకుడు దడాల విజయ్‌బాబు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల హామీల అమలే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌ను మళ్లీ గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గాబు రాజు, బెక్కం చంద్రగిరి, సర్పంచులు కటకం శివ, సోమాల ప్రసాద్, ఎంపీటీసీలు శివకోటి ప్రకాష్, గునిమానికల ఏసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అమోఘం



ప్రత్తిపాడులో ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్‌ను సత్కరిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

ప్రత్తిపాడు: కులమతాలు, రాజకీయాలకు అతీతంగా లయన్స్‌క్లబ్ సమాజానికి చేస్తున్న సేవలు అమోఘమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ కొనియాడారు. స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలు ఆవరణలో ఆదివారం రాత్రి జరిగిన లయన్స్ క్లబ్ రజతోత్సవ చార్టర్ నైట్ మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి మేలు చేయాలనే లయన్స్ క్లబ్ సంకల్పం ఉన్నతమైందన్నారు. లయనిజంలో రాజకీయాలకు తావివ్వరాదని ఎమ్మెల్యే పర్వత సూచించారు. లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ అధికారి గోపాలరావు మాట్లాడుతూ సేవా దృక్పథమే లయనిజమన్నారు. సేవలకు ప్రతిరూపమే లయన్స్ క్లబ్ సభ్యులని కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యే పర్వత ప్రసాద్‌ను లయన్స్ క్లబ్ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఇంజనీర్ మోహన్, లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ డి. రాఘవేంద్రరావు, మినర్వా అధినేత డీవీఎస్ రమేష్ రాజు, చార్టర్ నైట్ చైర్మన్ గుడాల వెంకటరత్నం, కార్యదర్శి ఏడిద రెడ్డినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

గండేపల్లి: మురారిలోని మామిడి తోటలో వేప చెట్టు కింది వెలసిన కనకదుర్గ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి వాహనాలపై వేలాదిగా భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి గాజులు, రవికలు, చీరలు సమర్పించి ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా జాతరకు వచ్చిన భక్తులు అక్కడే వంటలు చేసుకుని భోజనాలు చేశారు. అమ్మవారి సన్నిధిలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. అమ్మవారి జాతరలో ఏర్పాటు చేసిన జూట్ బాక్స్, స్టాల్స్, జెయింట్ వీల్, తదితర వాటితో చిన్నారులు ఆనందంగా గడిపారు. పూర్తిస్థాయిలో సౌకర్యాలు లేకపోవడంతో కొంతమంది భక్తులు ఇబ్బంది పడ్డారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై రామకృష్ణ, తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

శోభాయమానంగా అయోధ్యరాముని పాదుకయాత్ర

తుని: అయోధ్య రాముని దివ్య పాదుకయాత్ర ఆదివారం పట్టణంలో శోభాయమానంగా జరిగింది. ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు అయోధ్యలో స్వామివారి స్పర్శ పాదుకలను శిరస్సున ధరించి స్థానిక ఆంజనేయస్వామి గుడి నుంచి మెయిన్‌రోడ్డు, జీఎన్టీ రోడ్డు, సినిమా రోడ్డు మీదుగా శోభాయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ తుని సహ కార్యవాహ గోపి మాట్లాడుతూ అయోధ్యలో రామ మందిరం నిర్మాణానికి తుని పట్టణ ప్రజల నుంచి రూ.30 లక్షలు సేకరించి అందజేశామన్నారు. అయోధ్య రాముని అక్షతలను 150 గ్రామాల్లో పంపిణీ చేశామన్నారు. ఈ నెల 22న అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా భక్తులు అక్షతలను శిరస్సుపై వేసుకోవాలని సూచించారు. శోభాయాత్రలో సరస్వతీ శిశుమందిర్ విద్యార్థుల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో దాడిశెట్టి విష్ణుచక్రం, దండెం రామకృష్ణ, చదరం నర్సింగ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



తునిలో అయోధ్య రాముని పాదుకయాత్ర నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు

తెలుగు మహాసభల్లో వరశ్రీకి పురస్కారం

తుని: అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో స్థానిక మున్సిపల్ హైస్కూల్ ఉపాధ్యాయుడికి పురస్కారం లభించింది. రాజానగరం గైట్ కళాశాలలో ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 5, 6, 7 తేదీల్లో తెలుగు అంతర్జాతీయ మహాసభలు నిర్వహించారు. స్థానిక శ్రీచెక్కా శ్రీరామమూర్తి పురపాలక ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఈరంకి వీరవెంకటసత్యవరప్రసాద్ (వరశ్రీ) ఈ మహాసభల్లో పాల్గొని ప్రతిభ చూపారు. రాజరాజనరేంద్రుని 'సహస్ర కవిత నీరాజనం' కవి సమ్మేళనంలో పాల్గొని తెలుగుభాష గొప్పతనంపై కవితాగానం చేశారు. దీనిలో ఉత్తమ ప్రతిభ కనపరచడంతో నిర్వాహకులు ఆదివారం వరశ్రీకి ప్రసంసాపత్రం, మెడల్ అందజేశారు. అవార్డు గ్రహీత వరప్రసాద్ మాస్టార్‌కు కవులు, ఉపాధ్యాయులు, పట్టణ ప్రముఖులు అభినందనలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న వరప్రసాద్ మాస్టారు

పార్టీ విజయానికి సైనికుల్లా పని చేయాలి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం

కిర్లంపూడి: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని మాజీ ఎంపీ, ఆ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం సూచించారు. మండలంలోని భూపాలపట్నం, శృంగరాయునిపాలెం, సోమరాయణంపేట, బూరుగుపూడి గ్రామాల్లో ఆదివారం పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004 నుంచి టీడీపీకి జగ్గంపేట నియోజకవర్గంలో ఓటమి తప్ప విజయం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా వైఎస్సార్ సీపీనే విజయం సాధిస్తుందన్నారు. పార్టీలకు అతీతంగా అర్హతే కొలమానంగా తీసుకుని అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం లబ్ధిదారులకు నూతన పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువనేత తోట రాంజీ, వైఎస్సార్ సీపీ నాయకులు తోట బాబ్జి, అరబోలు వాసు, పాఠంశెట్టి కృష్ణమూర్తి, నకిరెడ్డి సుధాకర్, సరిసే సంతోష్, బస్వా శివ, గరగా పెద్దకాపు, తోట అయ్యన్న, ఓలేటి రాజు, బేరి బాబ్జి, అడబాల సుబ్బారాయుడు, ఆశపు భద్రి, అడారి మహేశ్, వేగి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



శృంగరాయునిపాలెంలో పార్టీ శ్రేణులను కలిసిన తోట నరసింహం, యువ నేత తోట రాంజీ